సాక్షి
సిద్దిపేట
గురువారం । 29 । ఆగస్టు । 2024



లక్ష్యానికి చేరువగా..

జిల్లాలో వానాకాలం సాగు లక్ష్యానికి చేరువలో ఉంది. వరి నాట్లు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో మరింతగా పెరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వివరాలు 8లో ▸



సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸



రెగ్యులర్ చేయండి

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

పాఠకుల అభిరుచి మేరకే పుస్తకాలు

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్



రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

హుస్నాబాద్‌రూరల్: గ్రంథాలయాల్లో పాఠకుల అభిరుచి మేరకే పుస్తకాలు కొనుగోలు చేస్తామని, పోటీ పరీక్షలకు ఉపయోగపడే బుక్‌లను కూడా ఏర్పాటు చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ, గ్రంథాలయల్లో ఖాళీలను భర్తీ చేసి విద్యార్థులకు, నిరుద్యోగులకు కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేస్తామన్నారు. త్వరలోనే హుస్నాబాద్ గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయల్లో ఉన్న ఖాళీ పోస్టుల భర్తీ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం గ్రంథాలయ ఉద్యోగులు రియాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

1న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మిరుదొడ్డి(దుబ్బాక): ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్–15 సబ్ జూనియర్ బాల బాలికల జట్లను సెప్టెంబర్ 1న ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రమణ తెలిపారు. బుధవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడారు. 02–01–2010 తర్వాత జన్మించిన క్రీడాకారులు ఎంపికలో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. బీహెచ్‌ఈఎల్ ఓల్డ్ ఎంఐజీలో జిల్లా జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 14, 15వ తేదీల్లో జరిగే తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. ఎంపిక కోసం వచ్చే క్రీడాకారులు 3 పాస్ ఫొటోలతో పాటు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో మధ్యాహ్నం 2.30 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9704746511, 9440703038 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న డాక్టర్ ఆనంద్

సిద్దిపేటకమాన్: జిల్లాలో సీజనల్ ఫీవర్‌ను ఎదుర్కోవడంతో పాటు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందజేస్తామని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్ తెలిపారు. సిద్దిపేట కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అన్ని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్‌లతో కలిసి ఆయన ఇంటెన్సివ్ ఫీవర్ సర్వేపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో తొమ్మిది బృందాలతో ఇంటింటి ఫీవర్ సర్వే సాగుతోందన్నారు. జ్వర లక్షణాలున్న బాధితులను గుర్తించి మందులు అందజేయడంతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నామన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్‌లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు నిబద్ధతతో పనిచేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. కళాశాలలను పరిశుభ్రంగా ఉంచుతూ పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. అధ్యాపకులు సమయపాలన పాటించేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విద్యలో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వార్షిక ఫలితాల్లో జిల్లాను ముందు వరుసలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ చిక్కులు

- క్షేత్రస్థాయిలో అధికారులకు ఎదురవుతున్న సమస్యలు
- మూడున్నరేళ్లు కావడంతో చేతులు మారిన భూములు
- జిల్లా వ్యాప్తంగా 1.03 లక్షల మంది దరఖాస్తు



క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్(ఫైల్)

సాక్షి, సిద్దిపేట: దరఖాస్తులో పేర్కొన్న ఫోన్ నంబర్లు మనుగడలో ఉండకపోవడం, ప్లాట్ హద్దులు సరిగా లేకపోవడం, దరఖాస్తుదారులు స్పందించకపోవడంతో అధికారులకు చిక్కులుగా మారాయి. ఇలా ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తు పరిశీలనలో సమస్యలు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.03 లక్షల మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేశారు. గతంలో సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తులను పరిశీలన జరగలేదు. ఇటీవల వీటి దరఖాస్తులను పరిశీలించాలని అధికారులను సీడీఎంఏ ఆదేశించారు. దరఖాస్తుల కోసం ప్రత్యేక యాప్‌ను సీడీఎంఏ రూపొందించారు. సుడా, మున్సిపాలిటీలలో హెల్ప్‌డెస్క్‌లను సైతం ఏర్పాటు చేశారు.

స్వీకరించిన దరఖాస్తులివే

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను నవంబర్ 2020 వరకు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 1,03,964 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలన కోసం 549 మంది అధికారులతో 29 టీంలను ఏర్పాటు చేశారు. వీరికి శిక్షణ సైతం ఇచ్చారు. ఇవి దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు. ఇప్పటి వరకు 1,778 ఆమోదం తెలపగా, రిజెక్ట్ 398, దరఖాస్తులను క్లోజ్ చేసినవి 181, నిషేధిత భూములు 2,265 ఉన్నాయి.

- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఎల్–1, ఎల్–2, ఎల్–3 మూడు లాగిన్లు కేటాయించారు. మూడు విడతల్లో వివరాలు ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.
- ఎల్–1 ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాయి. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ స్థలాలు, లే అవుట్ ఖాళీ స్థలాలు చూస్తాయి.
- ఎల్–2 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ టౌన్ ప్లానర్, డిప్యూటీ టౌన్ ప్లానర్, టౌన్ ప్లానర్ పరిశీలించి అర్హత పొందిన లే అవుట్ స్థలానికి రుసుం ఖరారు చేయనున్నారు.
- ఎల్–3 ఆయా మున్సిపాలిటీలు, సుడా, డీటీసీపీ అధికారులు ప్రొసీడింగ్ కాపీలు జారీ చేయనున్నారు.

పరిధి	దరఖాస్తులు	ఆమోదం	రిజెక్ట్	క్లోజ్	నిషేధిత భూములు
సుడా	21,340	0	0	0	507
మున్సిపాలిటీలు	57,911	1,778	398	181	776
గ్రామ పంచాయతీలు	21,401	0	0	0	964
హెచ్ఎండీఏ	3,042	0	0	0	18

చేతులు మారిన భూములు

ఎల్‌ఆర్‌ఎస్ కోసం నవంబర్ 2020లో దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటి వరకు మూడున్నర ఏళ్లు గడుస్తున్నాయి. భూములను వివిధ అవసరాల నిమిత్తం పలువురు విక్రయించుకున్నారు. కొన్ని స్థలాలు ఇద్దరు ముగ్గురు చేతులు సైతం మారినట్లు తెలుస్తోంది. దీంతో గతంలో పేర్కొన్న ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తే స్పందించడం లేదు. దరఖాస్తులో పేర్కొన్న ఫోన్ నంబర్‌లు పని చేయడం లేదు. అలాగే దరఖాస్తుదారులు పలువురు స్పందించడం లేదు. భూముల హద్దులకు సంబంధించిన రాళ్లు తొలగించడంతో స్థలాన్ని నిర్ధారించలేకపోతున్నారు. దరఖాస్తుదారులు ఫోన్‌లలో స్పందించకపోవడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్థితి తెలుసుకుందా ఇలా..

దరఖాస్తుదారులు అయోమయానికి గురికాకుండా ఉండేందుకు దరఖాస్తు స్టేటస్‌ను చూసుకునే అవకాశాన్ని కల్పించారు. వెబ్‌సైట్‌లోకి వెళ్లి వారి దరఖాస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. సరైన దస్త్రాలు లేకపోయినా వాటిని సవరించుకునేందుకు సిటిజన్ లాగిన్ ద్వారా దరఖాస్తుదారులకు అవకాశాన్ని కల్పించారు. WWW.LRSTELANGANA.GOV.IN అనే వెబ్‌సైట్‌లో సిటిజన్ లాగిన్‌లోకి వెళ్లాలి. దరఖాస్తులో పేర్కొన్న ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలి. వెంటనే ఓటీపీ వస్తుంది. ఈ నంబర్ ఎంటర్ చేస్తే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు స్టేటస్ తెలుస్తుంది. దరఖాస్తుతో ఆన్‌లైన్‌లో జతపరచని దస్త్రాలు ఏమైనా షార్ట్‌ఫాల్ ఉన్నాయో చెక్ చేసి ఆయా డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.

మూడు నెలల్లో పూర్తి చేస్తాం...



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మూడు నెలల్లో పరిశీలన పూర్తి చేసేందుకు లక్ష్యం పెట్టుకున్నాం. దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి స్థలాన్ని చూపించాలి. పరిశీలనకు వచ్చిన అధికారులు జియో ట్యాగ్ చేయాల్సి ఉంటుంది.

– వందనం, సీపీఓ, సుడా

రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదకరం

- ఎంవీ యాక్ట్ ప్రకారం కేసులు
- వాహనదారులు నిబంధనలు పాటించాలి
- ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాంగ్ సైడ్ డ్రైవింగ్ వాహనదారుడికి, ఎదురుగా వచ్చే వాహనదారులకు, నడుస్తున్న బాటసారులకు ప్రమాదకరంగా మారుతుందని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ అన్నారు. అందువల్ల ప్రతీఒక్కరూ సురక్షితంగా డ్రైవింగ్ చేయాలన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో వాహనాలను తనిఖీలు చేశారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేని వాహనదారులు, సీట్‌బెల్ట్ ధరించిన వాహనదారులను, నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించామన్నారు. ఆ మేరకు 21 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ, పట్టణంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం వల్ల చేసే వ్యక్తికి, ఎదురుగా వచ్చే వ్యక్తికి చాలా ప్రమాదమన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వారిపై కఠినంగా వ్యవరిస్తామని హెచ్చరించారు. సరైన మార్గంలో వెళితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని సూచించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసిన వాహన యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించి చట్ట ప్రకారం జరిమానా విధిస్తామని తెలిపారు. వాహనం నడిపే ప్రతీ వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతీఒక్కరూ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ వెంబడి ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ గోపాల్ రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్, సదాశివరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతులు

సిద్దిపేటకమాన్: గణేశ్ మండపాలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం సంబంధిత పోలీసు స్టేషన్ అధికారిని సంప్రదించాలని సూచించారు. మండపానికి విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు లౌడ్ స్పీకర్లను వినియోగించవద్దని సూచించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. ప్రశాంతమైన శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. దాని కోసం పోలీసులకు ప్రజలందరూ సహకరించాలన్నారు.



కొడకండ్లలో రైతు రుణమాఫీపై వివరాలు సేకరిస్తున్న ఏడీఏ బాబునాయక్

రైతుల వివరాల సేకరణ

రుణమాఫీపై ఇంటింటి సర్వే

గజ్వేల్‌రూరల్: రుణమాఫీపై వ్యవసాయాధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని గజ్వేల్, కొండపాక, కుకునూర్‌పల్లి, రాయపోల్ మండలాల్లో రైతుల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయా బ్యాంకుల పరిధిలో రుణమాఫీ కాని రైతులను గుర్తించి వారి కుటుంబ సభ్యుల వివరాలను, (ఫ్యామిలీ గ్రూపింగ్) ఫొటోలను తీసుకున్నారు. సర్వే వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి, రైతు రుణ మాఫీలో ఎదురైన సమస్యలను గుర్తించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఏవైనా ఫిర్యాదులుంటే ఆయా మండలాల వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఓ నాగరాజు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ కోసం నిర్వహించనున్న పరీక్షలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 8వ తరగతి విద్యార్థులు సెప్టెంబర్ 11 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

లబ్ధిదారుల చెంతకు పథకాలు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

- సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా ప్రగతి సమీక్షలో మెదక్ ఎంపీ రఘునందన్

సిద్దిపేటరూరల్: ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే ప్రతి పథకం సకాలంలో లబ్ధిదారులకు అందేలా అధికారులు చూడాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా అభివృద్ధి ప్రగతిపై మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. జిల్లా ఉపాధి హామీ పథకంలో భాగంగా నూతన గ్రామ పంచాయతీల నిర్మాణం పూర్తి చేసి, వచ్చే నెల 19 వరకు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా ఉంటుందని, మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంపై చేపట్టిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యామ్నాయ చర్యల్లో తమ వంతు సహకారం అందిస్తానన్నారు. జిల్లాలో 10 ఏళ్లుగా నాటిన మొక్కల వివరాలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా ఉందని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, తన వంతు సాయం అందిస్తానన్నారు. దుబ్బాక నుంచి వేరే దేశాలకు వలస వెళ్లే వారు ఎక్కువ ఉన్నందున వారికోసం ప్రత్యేకంగా స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసే క్రమంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు మంజూరైన నూతన జాతీయ రహదారికి ఇరువైపులా మల్టీ లేయర్ మొక్కలు నాటాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కేటాయించిన రెండు పడక ఇళ్ల అర్హులకు పట్టాలను అందించే పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్ల అర్హులకు పట్టాలను అందించే పనులు చేపట్టాలన్నారు. దుబ్బాకలో 1,135 ఇండ్లకు గతంలో 520కి పైగా ఎంపిక య్యారన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో వెంటనే చికిత్స జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల దృష్టి సారించాలన్నారు. జిల్లాలో రెండు బ్లడ్ బ్యాంక్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో నిర్మించిన ప్రాజెక్టులకు సంబంధించిన మట్టి సేకరణ, ఖర్చుల వివరాలు, మైనింగ్ వంటి వివరాలను అందించాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వైర్ల కింద పెద్దగా పెరిగే మొక్కలు నాటవద్దన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులపై అసహనం

360 ఎకరాల సమీకృత కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ మనుచౌదరి



కొండపాక(గజ్వేల్): అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణంపై అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(గజ్వేల్): సమీకృత కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మండలంలోని దుద్దెడ, మర్పడ్గ గ్రామాల సరిహద్దుల్లో 360 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కలెక్టరేట్ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో, కలెక్టరేట్ కార్యాలయ స్థలంలో ఎవరెవరికీ ఎలా కేటాయింపులు చేశారనేది సర్వే మ్యాప్ ద్వారా అధికారులు వివరించారు. కలెక్టరేట్ నిర్మాణానికి భూములిచ్చిన వారి కోసం కేటాయించిన భూమిలో లేఔట్ చేసి ప్లాట్లు అందించాలన్నారు. ప్రహరీ నిర్మాణంలో అక్కడక్కడ నిలిచిపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కోర్టు కాంప్లెక్స్‌కు తాత్కాలికంగా దారిని నిర్మించేందుకు, లేఔట్ డెవలప్‌మెంట్ చేయడానికి, ప్రహరీ నిర్మాణం పూర్తి కావడానికి ప్రతిపాదనను తయారు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ల్యాండ్ సర్వేయర్ వినయ్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు

దుబ్బాక: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతో పాటు మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. నియోజకవర్గం అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ మనుచౌదరిని కలిసి ఆయన వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో, గ్రామ పంచాయతీల్లో నీటి కొరత ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే దీనిపై దృష్టి సారించి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు.

భూములను పరిరక్షించాలి

మంత్రి పొన్నంకు విన్నపం

దుబ్బాక: ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఇచ్చిన అసైన్‌మెంట్, చెరువు శిఖం భూములను పరిరక్షించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్, తునికి సురేశ్‌లు విన్నవించారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. అసైన్‌మెంట్, చెరువు శిఖం భూములను కబ్జాల బారి నుంచి పరిరక్షించాలన్నారు. ఆక్రమణదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కూడా వినతి పత్రం అందించారు.

వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి



డీఆర్‌డీఏ జయదేవ్ ఆర్యాకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నాయకులు, వీఓఏలు

సిద్దిపేటరూరల్: ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం వీఓఏలకు కనీస వేతనంగా రూ. 26 వేలు అందించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. వీరి సమస్యల పరిష్కరించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ.. గ్రామస్థాయిలో 17,606 మంది వీఓఏలు పనిచేస్తున్నారన్నారు. మహిళా సంఘాల ద్వారా సంఘటితం చేస్తూ వారిని ఆర్థికంగా బలోపేతమయ్యేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. 10 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి కేవలం రూ.5 వేల గౌరవ వేతనం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ, కార్యదర్శి రవికుమార్, కిష్టయ్య, మహేశ్, స్వామి, భవాని, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ల సమస్యలను పరిష్కరించండి

టీజీఎల్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం



ప్రిన్సిపాల్స్‌ను సన్మానిస్తున్న టీజీఎల్‌ఏ బాధ్యులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు తమ సంఘం పూర్తి సహాయ సహకారాలను అందిస్తోందని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం(టీజీఎల్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం అన్నారు. బుధవారం నూతనంగా ఎన్నికైన ప్రిన్సిపాల్స్ సంఘ బాధ్యులను, జిల్లా నుంచి బదిలీ అయిన, బదిలీపై జిల్లాకు వచ్చిన ప్రిన్సిపాల్స్‌ను టీజీఎల్‌ఏ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. స్వాగత కార్యక్రమాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూచంగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించి శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనాల కోసం తమ సంఘం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. కళాశాలల్లో లెక్చరర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రిన్సిపాల్స్ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి ధరిపల్లి నగేశ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యను బలోపేతం చేద్దాం

ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమని, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రిన్సిపాల్స్ బాధ్యత ఎంతగానో ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కళింగ కృష్ణకుమార్ అన్నారు. అనంతరం సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిషన్, ప్రధానకార్యదర్శిగా రాజన్న, ఉపాధ్యక్షుడిగా దేవస్వామి, సంయుక్తకార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా మధుశ్రీవాత్సవ, మహిళా కార్యదర్శిగా జ్యోతి, కార్యవర్గసభ్యులుగా రవీందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డిలు ఎన్నికయ్యారు. సంఘ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, ఇంటర్‌విద్యను బలోపేతం చేస్తామని నూతన కమిటీతో కృష్ణకుమార్ ప్రమాణం చేయించారు.

క్లుప్తంగా

రోబొటిక్స్‌పై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేటఎడ్యుకేషన్: నైపుణ్య విద్యను అందించడంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ముందుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. సోహన్ అకాడమీ హైదరాబాద్ సౌజన్యంతో బుధవారం కళాశాలలో రోబొటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండేళ్లుగా తమ విద్యార్థులు రోబొటిక్స్‌పై అవగాహన పెంపొందించుకొని పాఠశాల విద్యార్థులకు శిక్షణను అందించినట్లు తెలిపారు. సోహం అకాడమీ డైరెక్టర్ సహదేవ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే 5 వేల పాఠశాలల విద్యార్థులకు శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులకు తమ అకాడమీ ద్వారా రీసెర్చ్ ప్రాజెక్టులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రకటించిన ఎమ్మెస్సీ ఎంట్రెన్స్ ఫలితాల్లో 100 లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి డా. మధుసూదన్, వైస్ ప్రిన్సిపాల్ డా.అయోధ్య రెడ్డి, అధ్యాపకులు భవానీ, రజినీ, సత్యనారాయణరెడ్డి, మహేశ్‌కుమార్, భైరయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రోత్సహించాలి

ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి


సూరజ్‌ను అభినందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. హవేలిఘనపూర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డ్ వర ప్రసాద్ కుమారుడు సూరజ్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించాడు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అతడిని ఎస్పీ అభినందించారు. 4న హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంపు చాంపియన్ షిప్ 2024 పోటీల్లో బాలుడు స్వర్ణ పతకం సాధించాడు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్ఎస్ఐ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

మేళ్ల చెరువు కబ్జాపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులను పరిరక్షించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టి తీసుకెళ్లినట్లు బీఎస్పీ నాయకుడు సుంకు వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రియల్ వ్యాపారులు మేళ్ల చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. మరి కొందరు వరద కాల్వను కబ్జాచేసి నిర్మాణాలు చేశారని వివరించారు. వీటిపై హైడ్రా కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వివరించినట్లు పేర్కొన్నారు. ఆయన వీటిపై సానుకూలంగా స్పందించారని, త్వరలో తెల్లాపూర్ వస్తానని చెప్పినట్లు వివరించారు.

లక్ష్యానికి చేరువగా..

జిల్లాలో వానాకాలం సాగు లక్ష్యానికి చేరువలో ఉంది. గతేడాది 5.20 లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తే ప్రస్తుతం 4.75 లక్షల ఎకరాలకుపైగా సాగులోకి వచ్చింది. భారీగా తగ్గుతుందనుకున్న వరి ఇప్పటికే 3.21లక్షల ఎకరాలకుపైగా సాగులోకి వచ్చింది. గతేడాది పోలిస్తే 50 వేల ఎకరాలు తక్కువగా ఉంది. నాట్లు మాత్రం ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో వారంలో విస్తీర్ణం మరింతగా పెరగొచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

– గజ్వేల్


గజ్వేల్ ప్రాంతంలో వరి సాగు

జిల్లాలో ఆశాజనకంగా పంటల సాగు

- గతేడాది అన్ని పంటలు కలిపి 5.20 లక్షల ఎకరాలు
- ప్రస్తుతం 4.75 లక్షల ఎకరాల్లో..
- 3.21 లక్షల ఎకరాల్లో వరినాట్లు
- మరింత పెరగొచ్చంటున్న వ్యవసాయశాఖ అధికారులు

ప్రారంభంలో పత్తాలేని వర్షాలు

జిల్లాలో వానాకాలం సాగుకు సంబంధించి ప్రత్యేకమైన పరిస్థితులు అలుముకున్నాయి. సీజన్ ఆరంభంలో 45 రోజులపాటు వర్షాలు పత్తా లేకపోవడం వల్ల సాగు సగానికిపైగా పడిపోనుందా? అనే అనుమానం నెలకొంది. జూన్ నెలకు సంబంధించి ఇక్కడ 104.9 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతానికి 141.3 మి.మీ, జూలైలో 187.1 మి.మీ సాధారణ వర్షపాతానికి 199.8 మి.మీలు నమోదైంది. ఆగస్టుకు వచ్చేసరికి 172.3 మి.మీ సాధారణ వర్షపాతానికి మించి వర్షపాతం నమోదైంది. ప్రత్యేకించి ఈ నెలలో ముసురుతో కూడిన వర్షాలు రోజుల తరబడి కురవడంతోపాటుగా అక్కడక్కడా భారీ వర్షాలు కురిశాయి.

పత్తి లక్ష ఎకరాలకుపైనే..

పత్తి గతేడాది 1.10 లక్షల ఎకరాల్లో సాగులోకి వస్తే ఈసారి 1,00,603 ఎకరాల్లో మాత్రమే సాగైంది. నిజానికి పత్తి గతేడాదికి మించి 1.50 లక్షల ఎకరాల్లో సాగులోకి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. కానీ 10 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గింది. అలాగే మొక్కజొన్న 40 వేల ఎకరాల్లో సాగులోకి వస్తుందని భావిస్తే కేవలం 21,982 ఎకరాలకే పరిమితమైంది. కంది 6,150 ఎకరాల్లో సాగులోకి వచ్చింది. ఇతర పంటలు 25,707 ఎకరాల్లో చేపట్టారు. మొత్తంగా జిల్లాలో తాజా వానాకాలం సాగు విస్తీర్ణం 4,75,856 ఎకరాలకు చేరుకుంది. మొత్తానికి గతేడాది సాగు లక్ష్యానికి తాజాగా సాగు లెక్కలు దగ్గరలో ఉన్నా యి. కొద్ది రోజుల్లో 5 లక్షల ఎకరాలపై చిలుకు చేరుకోవచ్చని వ్యవసాయశాఖ చెబుతోంది.



గోదావరి జలాలను వదలడంతో..

జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లకు గోదావరి జలాలను వదలడంతో సాగు స్వరూపం మారిపోయింది. ఈ నెల మొదటి వారంలో కేవలం 1.50 లక్షల ఎకరాల్లో సాగైన వరి క్రమంగా పెరుగుతూ వస్తోంది. తాజాగా 3,21,414 ఎకరాలకు చేరుకుంది. జిల్లాలో ఇంకా వరి నాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఆగస్టు చివరి వరకు నాట్లు కొనసాగనున్నాయని, ఈ లెక్క గతేడాది వరి 3.70లక్షల ఎకరాల్లో సాగులోకి వచ్చిన వరి ఈసారి కూడా లక్ష్యానికి చేరువలో ఉండబోతోందని అధికారులు చెబుతున్నారు. అలా జరిగితే మొత్తం సాగు 5 లక్షల పైచిలుకు ఎకరాలను దాటనుందని అంటున్నారు. గతేడాది అన్ని రకాల పంటలు కలుపుకొని 5.20 లక్షల సాగులోకి వస్తే ఈసారి కూడా కొంచెం తక్కువగా అంటే 5 లక్షల పైచిలుకు దాటనుందని చెబుతున్నారు.

వరి సాగు పెరిగే అవకాశం

"జిల్లాలో ఇంకా వరి నాట్లు కొనసాగుతున్నాయి. ఈ సాగు ప్రస్తుతం 3.21 లక్షల ఎకరాలకుపైగా చేరుకోగా, కొద్ది రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. తద్వారా మొత్తం సాగు విస్తీర్ణం పెరగనుంది.

– రాధిక, జిల్లా వ్యవసాయాధికారి"

చెరువులు, కుంటలను నింపితేనే..

ఇదిలా ఉంటే సాగు విస్తీర్ణం లక్ష్యానికి చేరువలో ఉన్నా చెరువులు, కుంటల్లోకి మాత్రం కొద్దిపాటి నీరు మాత్రమే చేరింది. మళ్లీ భారీ వర్షాలు రాకపోతే మాత్రం వరి సాగు చేసిన రైతులు కాల్వలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భంలో జిల్లాలోని చెరువులు, కుంటలను నింపి కాల్వలకు నీరు వదలడమే కాకుండా, కూడవెల్లి, హల్దీవాగులకు నీళ్లు వదలితే పంటలకు ఇబ్బంది ఉండదు.

ఒక్క రోజే నలుగురు సస్పెండ్

- ఇద్దరు డాక్టర్లు, అందోల్ తహసీల్దార్
- స్టాఫ్ నర్సును ఉద్యోగంలో నుంచి తొలగింపు
- బస్తీ దవాఖాన డాక్టర్‌కు మెమో జారీ
- కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలు
- జోగిపేటలో చర్చనీయాంశం

జోగిపేట (అందోల్): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్లు, తహసీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వల్లూరి క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి నియోజకవర్గ కేంద్రమైన అందోల్ మండలంలో డాక్టర్లు సస్పెండ్ కావడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. 27వ తేదీన అందోల్ జోగిపేట పట్టణంలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆకస్మిక తనిఖీలు చేసిన విషయం విదితమే. తనిఖీ సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం, విధులపై నిర్లక్ష్యంగా ఉండటంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. కొద్దిరోజులుగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ అందుబాటులో లేని అందోల్ తహసీల్దార్ నజీమ్ ఖాన్‌ను సస్పెండ్ చేశారు. జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తనిఖీ చేస్తున్న సమయంలో కూడా పలువురు రోగులు డాక్టర్లపై ఫిర్యాదులు చేశారు. దీంతో జోగిపేట ప్రాంతీయ వంద పడకల ఆస్పత్రి డాక్టర్లు నాగరాజు, దివాకర్‌లను సస్పెన్షన్ చేశారు. అందోల్ బస్తీ దవాఖాన డాక్టర్ రిజ్వాన్ రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడం, డ్రెస్ కోడ్ పాటించక పోవడంతో మెమో జారీ చేశారు. స్టాఫ్ నర్స్ రాథోడ్ రేణుక విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం, నిర్లక్ష్యంగా ఉండడంతో ఆమెను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే రోజు నలుగురు అధికారులు సస్పెండ్ కావడం జోగిపేటలో చర్చనీయాంశమైంది.

'సమగ్ర శిక్ష' ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

– కలెక్టరేట్‌ల ఎదుట సిబ్బంది ఒక రోజు నిరసన దీక్ష


సిద్దిపేటరూరల్: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు


సంగారెడ్డి ఎడ్యుకేషన్ : డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సిద్దిపేటరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేస్తూ, వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకిషన్, నవీన్ కుమార్ మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబర్ 13న హన్మకొండలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా శాఖలో భాగమైన సమగ్ర శిక్షలో 19, 652 మంది మంది కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారన్నారు. 18 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికైనా తమను గుర్తించి వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

డీఆర్వో పద్మజకు వినతిపత్రం..

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలోని ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్వో పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ.. గతంలో ఉన్న ప్రభుత్వానికి చాలా సార్లు పర్మినెంట్ చేయాలని విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు, ప్రస్తుత ప్రభుత్వమైనా సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఇదే కాకుండా ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులను, , 61 ఏళ్లు నిండిన ఉద్యోగులకు రూ.20 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియో వంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలి


నూతన కార్యవర్గానికి ఎంపిక పత్రం అందజేస్తున్న తిరుపతిరెడ్డి

టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్ అర్బన్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా అజయ్, శ్రీలత, నవీన్, వినోద్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్‌పై ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల విద్యారంగం తీవ్రంగా నష్ట పోయిందన్నారు. ఎంఈఓ పోస్టులు, డైట్ లెక్చరర్ పోస్టులు, జూనియర్ లెక్చరర్ పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసి విద్యారంగాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏ లను వెంటనే ప్రకటించాలన్నారు. 2018 జూలై నుంచి పీఆర్‌సీ ని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న బకాయిల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ వజ్రమ్మ, కేశవరెడ్డి, విష్ణువర్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

– నీటిలో మునిగి ఇద్దరు యువకులు మృతి


నవీన్(ఫైల్)


రాము(ఫైల్)

చేగుంట(తూప్రాన్): సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందారు. ఈ ఘటన మాసాయిపేట మండల కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన డప్పు నవీన్(22), నెల్లూరి రాము(26) మరో స్నేహితుడు శేకుని రాజుతో కలిసి గ్రామ శివారులోని మార్కెట్ గోదాంల సమీపంలో క్వారీ నీటి గుంతలో ఈతకు మంగళవారం వెళ్లారు. నీటి గుంతలో ఈత కొట్టడానికి వెళ్తున్న రామును పట్టుకొని నవీన్ కూడా వెళ్లాడు. ఇందులో ఈతరాని నవీన్ లోతుకు వెళ్లేసరికి రామును గట్టిగా పట్టుకున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. వారి వెంట వచ్చిన మరో యువకుడు రాజు అక్కడి నుంచి వెళ్లిపోయి భయపడి విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. బుధవారం నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన రాజు స్నేహితులు ఇద్దరు నీటిలో మునిగిపోయిన విషయాన్ని చెప్పాడు. గ్రామానికి చేరుకున్న ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి బంధువులకు సమాచారం అందించి గజ ఈతగాళ్లతో మృతదేహాలను బయటకు తీయించారు. నవీన్ అన్నయ్య బాలనర్సు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతులు ఇద్దరూ కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

– అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో ఘటన


షేక్ యాకూబ్ మృతదేహం

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. వీరారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆమ్లెట్ విలేజ్ మాదన్నపేట గ్రామానికి షేక్ యాకూబ్ (43) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య షేక్ చాంద్‌బీ, 18 ఏళ్లలోపు ఇద్దరు కుమారులు, కూతురిని పోషించుకుంటున్నాడు. పొలం వద్ద బోరు బావికి సంబంధించిన స్టార్టర్‌తోపాటు పక్క పొలంలో ఉన్న మరో రైతు రంగనమైన యాదగిరి స్టార్టర్‌లో కరెంటు సరఫరా నిలిచి పోయింది. యాదగిరి బోరు స్టార్టర్ డబ్బాలోని కరెంటు వైర్లను సరి చేస్తున్న ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టి యాకూబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భూంపల్లి ఎస్ఐ హరీశ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి భార్య షేక్ చాంద్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కమీషన్ పేరుతో రూ.7.80 లక్షలు మోసం



పటాన్‌చెరు టౌన్: టాస్కుల కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసం లో ఓ వ్యక్తి భారీ ఎత్తున నగదు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆగస్టు 8వ తేదీన వాట్సాప్‌కు మెసేజ్ రాగా వ్యక్తిగత వివరాలను నమోదు చేశాడు. అనంతరం ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేశాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తన కిచ్చిన వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. బాధితుడు మొత్తం రూ.7.80 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెఫ్ ఉద్యోగం పేరిట రూ.1.75 లక్షలు..

మరో ఘటనలో.. పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన చెఫ్(వంట మాస్టర్)కి ఆన్‌లైన్‌లో చెఫ్ ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. అపరిచిత వ్యక్తులు బాధితుడికి చెఫ్ ఉద్యోగం ఉందంటూ ఏప్రిల్ 25న మెసేజ్ పంపారు. బాధితుడు తన వివరాలను నమోదు చేసి ఉద్యోగం ప్రాసెస్ కోసం రూ.1.75 లక్షలు పంపాడు. తీరా ఉద్యోగం కోసం అడుగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. బాధితుడు బుధవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

పటాన్‌చెరుటౌన్: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రజనీశ్ కుమార్(31) భార్యాపిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ము మారుతీ హిల్స్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. 27వ తేదీన రజనీశ్ కుమార్ మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్య శారదతో గొడవపడ్డాడు. అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్ కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన భార్య చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. ఎస్ఐ దుర్గయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి..

గజ్వేల్‌రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని బూర్గుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెల్మెటి బాలచంద్రం (39)కి భార్య రాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాలచంద్రం మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న బాలచంద్రం మద్యానికి బానిసయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి మృతి చెంది కనిపించాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్


పరిశోధనా గ్రంథాన్ని చూపుతున్న నవత

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో కామర్స్ విభాగంలో పనిచేస్తున్న జేజే నవతకు ఉస్మానియా యూనివర్సిటీ బుధవారం డాక్టరేట్‌ను అందించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'భారతదేశంలో నిర్దిష్ట చెల్లింపులు, బ్యాంకుల పనితీరు' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. మారుమూల గ్రామాలకు, తక్కువ ఆదాయ వర్గాలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలను అందించడంతో ఆర్థిక అక్షరాస్యతను పెంచి భారత ఆర్థిక వ్యవస్థను డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపొందించడంలో పేమెంట్ బ్యాంకులది కీలకపాత్ర అని తన పరిశోధనలతో తేలిందన్నారు. తన పరిశోధనకు సహకరించిన తండ్రి ఐలేష్, కళాశాల అధ్యాపకులకు, సిబ్బందికి, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర సునీత, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ గోపాలసుదర్శనం, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

నిందితుడి అరెస్టు

నారాయణఖేడ్: వృద్ధురాలిపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితుడిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఓ దుకాణం ఎదుట నిద్రిస్తున్న మతిస్థిమితం లేని 60 ఏళ్ల వృద్ధురాలిపై పట్టణానికి చెందిన కూరగాయల వ్యాపారి మోయిన్ మంగళవారం రాత్రి అఘాయిత్యానికి పాల్పడ్డాడని అన్నారు. బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.

భూ పట్టాలో తహసీల్దార్ మోసం

– ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన భూ బాధితులు


మాట్లాడుతున్న బాధితులు


జహీరాబాద్ టౌన్: వారసులను కాదని మొగుడంపల్లి తహసీల్దార్ ఇతరుల పేరుపై భూమి పట్టా మార్పిడి చేసి తనకు అన్యాయం చేసిందని బాధితుడు బుధవారం ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. మొగుడంపల్లి మండలం మన్నాపూర్‌కు చెందిన పీ.పారమ్మకు 3 ఎకరాల 33 గుంటల భూమి ఉండగా ఆమెకు పిల్లలు లేరన్నారు. భర్త సిద్దారెడ్డి చాలా రోజుల కిందట చనిపోగా ఇటీవలె పారమ్మ కూడా చనిపోయిందన్నారు. ఈ క్రమంలో సిద్దారెడ్డి తండ్రికి సంబంధించి (మనవళ్లు) నలుగురు ఉన్నామని అందరికీ సమానంగా ఆస్తి దక్కాలన్నారు. భూ పంపకం గురించి ఇటీవల తహసీల్దార్‌ను కలవగా వారసులంతా కలిసి రావాలని సూచించిందన్నారు. కానీ ఏమీ జరిగిందో తెలియదు కానీ తనకు తెలియకుండా నలుగురికి బదులు ముగ్గురి పేరున పట్టామార్పిడి చేసిందని ఆరోపించారు. భూ మార్పిడి ఎలా చేశారు.. కాగితాలు చూయించాలని కోరగా తహసీల్దార్ పట్టించుకోవడంలేదన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- అనంతరం డివైడర్ ఎక్కిన బస్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగీలా దాబా చౌరస్తాలో బుధవారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. చిన్నకోడూరు మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ గొట్టపర్తి విశ్వనాథం బుధవారం బైక్‌పై ఓ ఫంక్షన్ నిమిత్తం సిద్దిపేట రంగీలా దాబా చౌరస్తా నుంచి హైద్రాబాద్ రోడ్డు వైపునకు వెళ్తున్నాడు. హైద్రాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్న ఆసిఫాబాద్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గొట్టపర్తి విశ్వనాథంకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108కు సమాచారం ఇవ్వగా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. విశ్వనాథంను తప్పించబోయిన బస్ డ్రైవర్ బస్సును డివైడర్ పైకి ఎక్కించాడు. బాధితుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మనోహర్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన వెల్దుర్తి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సదాత్‌మియా కథనం మేరకు.. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన యువకుడు పెద్ది మనోహర్(23) అతి వేగంగా బైక్ నడుపుతూ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మనోహర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎక్సెల్ వాహనంపై ఉన్న వెల్దుర్తి గ్రామానికి చెందిన హనుమాద్రి కృష్ణాగౌడ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.